5

"Prabhasa"

వాయుభక్షకుడు

దాదాపు పదేళ్ళక్రితం ఒక కుగ్రామంలో ఒక మామూలు ఇల్లాలు ఒక్కసారిగా ప్రసిద్ధవ్యక్తి అయిపోయింది. ఫలాని మాలక్ష్మమ్మగారింట్లో చాకిరిచేసే రంగడు అన్నమే తినట్ట, అన్న పుకారు ఊరంతా చుట్టేసుకుంది. అది క్రమంగా చుట్టుపక్కల గ్రామాలకుకూడా పాకింది.

"ఆఁ దొంగవేషమై ఉంటుంది" అన్నారుకొందరు. "ఈ వెధవ ప్రపంచంలో ఏదిచెప్పినా నమ్మేవాళ్ళున్నారుగద" అన్నారు మరికొందరు. అట్లా అన్నం తినకుండా బతికే అవకాశమే ఉంటే నిన్న మొన్న ఆ బెంగాల్లో అన్ని లక్షలమంది ఎందుకు చావాలిసొచ్చిందీ? అన్నారు ఇంకా కొందరు.

కాని ఈ వార్త నమ్మినవాళ్ళే జాస్తి.

"ఏ మనిషిలో ఏ మహత్తుంటుందో ఎవరు చూశారు? మా వదినెగారి ఊర్లో ఓ పిచ్చిపిల్లవాడు చెట్టుచూసి క్షణంలో చెప్పేస్తాట్ట, ఎన్ని ఆకులున్నాయో! ఎండుమిరపకాయ గల గల్లాడిస్తే ఎన్ని విత్తులున్నదీ చెప్పేస్తాట్ట!" అని కొందరూ, "జలభక్షణా, వాయుభక్షణా అనే మాటలు ఊరికే పుట్టినాయట్రా? ఏ పుట్టలో ఏ పాముందో ఎవరు చెప్పగలరు? ఏజన్మలోనో యోగిఅయి ఉంటాడు. కించిత్తు దోషంచేసుకొని ఈ జన్మలో ఈ తక్కువ పుటక పుట్టాడు. ఆ పాపం కాస్త పరిహారం అయిపోగానే ఆ శ్రీమన్నారాయణమూర్తివారి సన్నిధికి నేరుగా చక్కాపోతాడు!" అని మరికొందరూ, "ప్రకృతి

చిత్రాలను మనం ఊహించలేం. మా మేనమామల ఊళ్ళో ఏడు తలల ఈతచెట్టు లేదూ? పిడపర్రులో ఘంటలమ్మ తాళ్ళుండేవి కావూ? హిమాలయం మంచుకొండల్లో దిగంబరుడున్నాడని మనం వినలా? ఒకాయన నా చిన్నతనంలో మన ఊరి చెరువులో బొసినపట్టు వేసుకుని ఈ చివరనుంచి ఆ చివరకు ఈదాడని చెప్పుకోలేం? వాటిని మనం అర్థం చేసుకోలేం. మన పరిజ్ఞానం చాలదు. అంతే" అని ఒకరూ, ఈవిధంగా తలోమాటా అన్నారు.

ఇంతకూ రంగడు అన్నం తినడనేది ఎట్లా బయటపడిందంటే—

వాడు మాలక్ష్మమ్మగారింట్లో చాకరీ చేస్తూండేవాడు. వాడి కప్పుడు పదేళ్లో పన్నెండేళ్ళో ఉంటాయి. వాడి దసలు ఆ వూరు కాదు. తన దేవూరో వాడికీ తెలీదు. చిన్నతనంలోనే తల్లి చచ్చింది. తండ్రనేవాడు ఉన్నాడో లేదోకూడా ఎవరికీ తెలీదు. ఏడాదిక్రితం ఆవూరు వచ్చాడు. మాలక్ష్మమ్మగారింటికి వచ్చి పనిచేస్తానన్నాడు. ఏ చాకరీ అయినా చేస్తానన్నాడు. జీతంకూడా అడగలేదు. రెండుపూటలా ఇంత తిండిపెట్టే ఏర్పాటుతో వాణ్ని పనికి పెట్టుకున్నారు! పిల్లల ఎంగిలి కంచాల్లో మిగిలినది వాణ్ని తినమనేవాళ్లు. కంచాల్లో ఎక్కువ మిగిలినా తక్కువ మిగిలినా వాడేమీ పేచీపెట్టేవాడుకాదు. ఎంగిలి కంచాలు తీసుకుని ఇంటివెనక్కి పోయేవాడు. కంచాలు కడిగి తెచ్చి ఇంట్లో పెట్టేవాడు. కంచాల్లోది వాడు తింటున్నాడనే మాలక్ష్మమ్మగా రనుకునేది. ఆవిడకి మటుకేం తెలుసూ?

ఒకరోజు వెన్నెలరాత్రి. పిల్లల అన్నాలయ్యాక, ఎందుకో మాలక్ష్మమ్మగారు ఇంటివెనక్కు వెళ్ళేసరికి అక్కడ రంగడు తెల్లకుక్కను చేరదీసి దానికి కంచాల్లో అన్నం పెడుతున్నాడు. ఆపూట రంగడికి అన్నం తక్కువయిందని అంతో ఇంతో నొచ్చుకుంటున్న మాలక్ష్మమ్మకి చూడగానే శివం ఎత్తినట్టయింది.

"నీ కడుపుకాలా! ఆ అన్నం కాస్తా కుక్కకి పెడుతున్నావేరా? నువ్వేం తినిచస్తావ్?" అని అడిగిం దావిడ.

రంగడు మాటా పలుకూ లేకుండా కంచాలు తీసుకుపోయి, కడిగి తెచ్చి, లోపలపెట్టి, అరుగుమీద చుట్టచుట్టుకుని పడుకుని, నిద్రపోయాడు. అంతసేపూ యజమానురాలు వాణ్ణి తిట్టిపోస్తూనేవుంది. అడుక్కుతినేవాళ్ళందరికీ ఉండే తెగులే ఇదన్నది. పిల్లల ఎంగిలి తినటం కుంకకి నామోషీ అయింది కాబోలునన్నది. పాపంకదా అని ముష్టివాణ్ని చేరదీసి పిల్లలతో సమంగా పెంచితే కళ్లు నెత్తికొచ్చాయన్నది. తేరతిండి బాగా వంటపట్టి ఈకాడికి వచ్చిందన్నది. నాలుగు రోజులు తిండి పెట్టకపోతే డొక్కమాడి అప్పుడు తెలిసివస్తుందన్నది. ఇంకేమేమో అన్నది. దేనికీ రంగడు సమాధానం చెప్పలేదు.

కోపంవస్తే మా మాలక్ష్మమ్మ మామూలు మనిషి కాదు! మర్నాడు పొద్దున పిల్లలకంచాల్లో మిగిలినది రంగడు తినటానికి లేకుండా వీధిలో పారేసింది. మళ్ళీ తెల్లకుక్క వచ్చి అది కాస్తా తినేసింది. ఆ కుక్కను చూడగానే తాను చేసినపని అర్థంలేనిపని అని ఆవిడకు తట్టింది. తాను ఈపూట చేసినపనేగా వాడుచేసిందీను! అది శిక్ష ఎట్లా అవుతుందీ?

నిక్షేపంలాంటి అన్నంకాస్తా కుక్కకి పెట్టాడని ఆవిడ ఆగ్రహించిందేగాని, రంగడు ఏంతిన్నాడు, తినకుండా ఎట్లా ఉన్నాడన్న అనుమానం మా మాలక్ష్మమ్మకు ఇప్పుడే కలిగింది. తాను పెట్టే ఎంగిలిమెతుకులు కుక్కకువేసి వాడు ఇంకేదో తింటూవుండాలని ఆవిడకు తోచింది. తిండిగాని, డబ్బులుగాని ఇంట్లోనుంచి దొంగిలిస్తున్నాడాఅని ఆలోచించిచూసింది. నమ్మశక్యంగాలేదు. ఒకవేళ అవతలవీధిలో ఉన్న తన ఆడబడుచు వాణ్ణిపిలిచి తిండిపెట్టి, డబ్బులిచ్చి తనఇంటి రహస్యాలేమన్నా తెలుసుకుంటున్నదా అని అనుమానం కలిగింది. ఈ అనుమానానికి ఆధారం దొరకలేదు. ఎందుకైనా మంచిదని ఆరోజల్లా వాణ్ణి ఓకంట కనిపెడుతూనేవుంది. వాడెక్కడికీ పోలేదు. ఎవరితోనూ మాట్లాడలేదు. ఏమీ కొనుక్కొని తినలేదు. అన్నిటినీ మించిన చిత్రమేమంటే తిండి మాటే ఎత్తలేదు. మామూలుగానే పనులన్నీ చేశాడు.

ఆ రాత్రి మాలక్ష్మమ్మ గుండె కరిగింది. వాడిమీద వచ్చిన కోపమంతా దిగిపోయింది. ఆవిడలెక్కన వాడప్పటికి మూడుపూటలు తిండితినలేదు. పిల్లల అన్నాలయినాక వాడికి మామూలుకన్న ఎక్కువ అన్నంపెట్టి, “పో వెధవా, పిచ్చికళలుపోక కడుపునిండా తిను’’ అన్నది. కంచాలూ, అన్నమూ తీసుకుని రంగడు ఇంటివెనక్కుపోయినాడు. మరుక్షణమే ఆవిడకేదో సందేహంతోచింది. ఆకలిమీద వున్న వాడు ఎంత ఆత్రంగా తింటాడో చూదామని ఆవిడ వాడివెనకే పిల్లిలాగా బయలుదేరింది. ఆవిడ గోడచాలుపునుంచి తొంగిచూసేసరికి బాదంచెట్టుపక్కగా తోక ఆడిస్తూ, తెల్ల

కుక్కా, దానిముందు అన్నంబోర్లిస్తూ రంగడూ కనిపించాడు.

మొదట మాలక్ష్మమ్మ నిర్ఘాంతపోయింది. తరువాత ఆవిడకు కలిగినది ఆగ్రహం. ఈసారి ఆవిడకోపానికి కారణం అన్నం కుక్క తినేస్తున్నదని కాదు; రంగడు ఇంత అస్వాభావికంగా ఎందుకు ప్రవర్తిస్తున్నాడాఅని! అసహజమైన పని చెయ్యటంలో వాడి కా పట్టుదల ఏమిటాఅని! ఆవిడకు రంగడిపై కలిగిన కోపంలాటిదే పూర్వం హిరణ్యకశిపుడుకి ప్రహ్లాదుడిపై కలిగివుండాలి.

"ఒరే రంగడూ! అని ఒక్క పొలికేక పెట్టింది మాలక్ష్మమ్మ. రంగడు నిర్ఘాంతపోయినాడు. ఆవిడ దగ్గిరికివస్తూంటే వొణికిపోయినాడు. మాలక్ష్మమ్మ రంగణ్ని చేతికి దొరికిన ఎండు బాదంకొమ్మతో బాదింది. ఆ బాదుడుకు అర్థం లేదు. వాడు తనదొక్క మాడ్చుకుంటున్నాడుగాని ఆవిడకు చేసిన ద్రోహం ఏమీ లేదు. ఆ ఎంగిలికంచాల అన్నంతో ఆవిడకు ఇంకేమీ ఉపయోగం లేదు. న్యాయంగా అది రంగడిసొత్తు. ఆవిడ ఆమోదించే న్యాయంప్రకారం చూసినా! దాన్నివాడు ఏంచేసుకున్నా ఆవిడకు అభ్యంతరం ఉండరాదు.

రంగడు ఏడిచాడు. మళ్ళీ "ఇల్లా చేస్తావా? చేస్తావా?" అని అడుగుతూ ఆవిడ కొడుతుంటే "చెయ్యనమ్మగారూ, చెయ్యనమ్మగారూ!" అన్నాడేగాని వాడు చేసిన తప్పేమిటో వాడికి తెలీదు.

ఇదంతా మాలక్ష్మమ్మకూ సుఖంగా లేదు. కొంతసేపయాక ఆవిడ వాణ్ని లోపలికి తీసుకుపోయి, "ఎందుకిట్లా అన్నంతీసుకుపోయి కుక్కకు పెడతావు? పొద్దువల్లా మాడిస్తేనే, సిగ్గు

లేదట్రా? నీ పొట్టసంగతి నువ్వు చూసుకోక ఆ కుక్క గొడవ నీకెందుకురా?" అన్నది.

వాడు మాట్లాడలేదు. వేరే ఏం తింటున్నావు, చెప్పమన్నది. ఏమీ తినటంలేదన్నాడు – వాడు. నీ కన్నం అక్కర్లేకపోతే చెప్పు. నాచేత నిష్కారణంగా దేనికి వండి వార్పిస్తావు? అన్నదావిడ. తనకు అన్నం అక్కర్లేదన్నాడు రంగడు. ఆవిడ నిర్ఘాంతపోయింది. కాని, వాడు చాలా ఏళ్లుగా తిండితినటమే లేదని విని, దాన్ని రూఢిచేసుకుని ఆవిడపొందిన ఆశ్చర్యానికి అంతులేదు.

ఆవిడే ఊరంతా టాంటాం వేసింది, రంగడు అసలు అన్నమే తినడని. తననోట ఈమాట విని ఒక్కొక్కరే ఆశ్చర్యపోతున్నకొద్దీ ఆవిడకు ఓవిధమైన ఆనందం కలగసాగింది. తానే అన్నం తినని మనిషి అయినట్టూ ప్రపంచం తననుచూసే ఆశ్చర్యపోతున్నట్టూ ఆవిడ భావించసాగింది. రంగడు అన్నం తినకపోవటంవల్ల తనకు ఊళ్ళో ఇంత ప్రాముఖ్యం వస్తుందని ఆవిడ కలలోకూడా అనుకోలేదు. అందరూ వాణ్ణిగురించి తనను అడిగేవాళ్ళే. రంగడికి తానొక గార్డియన్ అయికూచుంది!

కాని ఈ ఆనందం ఆవిడ కాలేకాలం దక్కలేదు. ఇతరులు రంగణ్ణి తనకుకాకుండా చేయాలని చూస్తున్నట్టు ఆవిడకు తోచింది. పొరుగింటి సుబ్బమ్మ వచ్చి చాలా ఇచ్చకాలాడింది. రంగణ్ణిచూసినప్పుడే అనుకుందిట, వాడు మామూలుమనిషి కాడని–నోరుబడ! వాడు తన ఇంట్లోనే పనిచేస్తుంటే పువ్వుల్లోపెట్టి పూజించేదట! వాణ్ణి కుక్కకన్నా హీనంగా చూశానట. వాడువచ్చినప్పట్నుంచీ మాలక్ష్మమ్మగారింటికి

ఎంతో కలిసొచ్చిందట! వాడొచ్చిన ఏడు మాలక్ష్మమ్మగారి కాకరపాదు కాచిన కాపుతోనే తాము - అంటే సుబ్బమ్మ అదంతా రంగడి మహిమ అనుకుందట.

ఆంజనేయోపాసనచేసే ఆ గడ్డం హనుమయ్యొచ్చాడు. రంగడికేసి రెప్పవాల్చకుండా చాలాసేపు చూసి, తల ఆడించి "తెలిసింది, తెలిసింది" అన్నాడు. చేతులు జోడించి ఆకాశం కేసి చూసి, కళ్ళు తేలేసి, గుంజీలుతీసి, రంగడి దగ్గిరకొచ్చి వాడిచెవులో ఏదో చాలాసేపు నూరిపోశాడు. "హనుమయ్య ఏం చెప్పాడ్రా?" అని తరువాత అడిగితే రంగడు భయంతో "చెప్పకూడదు, చెబితే నా తల పగిలిపోతుంది" అన్నాడు.

నోరు మాట్టాడితే నొసలు వెక్కిరిస్తుంది, ఆ బసవయ్యకు. ఆయనవచ్చికళ్ళెగరేస్తూ "నేర్పంటే మాలక్ష్మమ్మది. రంగడికిన్నాళ్ళూ జీతమూ ఇవ్వకుండా, తిండీ పెట్టకుండా పని చేయించుకుంద్దీ!" అని పదిమందీ వింటూండగా అనేశాడు!

రంగడుకూడా వెనకటి రంగడు కాదిప్పుడు. అందరూ తనను చూడరావటమూ "ఎన్నాళ్ళనుంచీ నువు తిండి మానేశావురా! నీ కేదైనా మంత్రంవచ్చా! ఏ బైరాగి అయినా చిట్కా ఇచ్చాడా! చాటుగా ఏమన్నా తింటూంటావా? కావాలని అన్నం తింటే ఏమవుతుందిరా? కడుపునెప్పి వస్తుందా! దాహమవుతుందా? వంటవాసనవస్తే నోరూరదూ?" ఇత్యాది ప్రశ్నలు వేస్తూండడము వాడికి భలే సరదాగావుంది.

గడిచిన రోజుల్లో టెంటుసినిమా లాడించిన వెంకయ్య రంగణ్ని గురించి మొదటగా పత్రికల్లో వేయించాడు. ఆయనే పత్రిక పట్టుకువచ్చి తాను వేయించిన వార్త చదివి వినిపిం

చాడు... "ఈ కుర్రవానికి వ్రాయను చదువను రాదు. వీనికి ఎట్టి మంత్రములును రావు. ఈ వింత చూచుటకు ప్రజలు తండోపతండములుగా చుట్టుపక్కల గ్రామములనుండి వచ్చుచున్నారు. కొందరు ఈ భగవదంశసంభూతునికి కానుకలు అర్పించి మ్రొక్కుకొనుచున్నారు." అని వెంకయ్య చదివే సరికే, అదంతా నిజం కాకపోయినా ఊళ్ళోవాళ్లు హర్షించారు.

ఈవార్త పత్రికల్లో పడ్డనాటినుండీ నిజంగానే జనం కానుకలతో రాసాగారు. మాలక్ష్మమ్మ కంగారుపడింది. ఈ వచ్చే జనమూ, వాళ్ళు తెచ్చే కానుకలూ మొదలైనవి చూస్తే వాటికితగ్గ పవిత్రవాతావరణం తనయింట లేనట్టు ఆవిడకు స్పష్టమయింది. ఈ సంగతి ఆవిడ వెంకయ్యతోనే అన్నది. వెంటనే వెంకయ్యకు గొప్ప ఆలోచన తట్టింది. ఆయన రాఘవయ్యతో మాట్లాడి, వాళ్ళతోటలో చిన్న కుటీరం వేయించాడు. అందులో రంగడికి మకాం ఏర్పాటుచేశారు. వాడికి చిన్న యోగివేషం వేయించాడు వెంకయ్య. తపస్సు చేస్తున్నట్టు వాణ్ని కూచోమన్నారు. ఎవరికీ ఏమీ జవాబులివ్వక్కర్లేదన్నారు. భక్తుల్నందర్నీ అక్కడికి రమ్మనమన్నారు.

"రంగడి కిది సమ్మతంకాలేదు. ఒకగంట కదలకుండా కూచునేసరికి వాడికి యమచెర అయిపోయింది. ఆకలి ఒకటి లేకపోయినా వాడికి మిగిలిన కోరికలన్నీ ఉన్నాయామె మరి. గొడ్లమధ్య తిరగటం, గోలికాయ లాడటం, చింతచెట్లెక్కడం, డాం దగ్గిర చేపలు పట్టేవాళ్ళతో కబుర్లు చెప్పటం; ఇవేవీ లేందే వాడికి జీవితమే లేదు. కళ్ళుమూసుకుని కూచుంటే వాడికి మొదట్లో నవ్వొచ్చింది.

"ఛీ! నవ్వకు" అన్నాడు రాఘవయ్య.

"మేం చెప్పినట్టు చేయకపోతివా తాట వొలుస్తాం!" అన్నాడు వెంకయ్య. ఈ ఇద్దరూ వాడికి యములయ్యారు.

కుక్క ఒకసమస్య అయింది. రంగడు రాఘవయ్యగారి తోటలో మకాం పెట్టినట్టు తెల్లకుక్క పసికట్టి నేరుగా వాడి దగ్గరికివచ్చి వాడి కెదురుగా కూచుంది. రంగడు రెండు మణికట్లూ రెండు మోకాళ్ళమీదా ఆనించి అభయముద్ర పట్టినట్లు కళ్ళుమూసుకుని కూచుంటే కుక్కకి ఇదంతా నిజమా? లేక నేను కలగంటున్నానా? అని అనుమానం కలిగినట్టుంది. అది తల ఒక పక్కకి ఒరగేసి రంగడికేసి పరీక్షగాచూసి, ఎందుకన్నా మంచిదని ముందుకువచ్చి వాడిమొహం నాకింది. ఈ సమయంలో లోపలికి వచ్చిన రాఘవయ్య దానినడుం విరిగేట్టు ఒక్కతన్ను తన్నాడు. ఏ అపచారం చెయ్యని తెల్లకుక్క భగవంతుడికి మొరపెట్టుకుంటూ అవతలికి పోయి పాకబయటినుంచి అరవసాగింది.

మాలక్ష్మమ్మను ఎవరూ తన్నలేదుగాని ఆవిడ గతీ దాదాపు కుక్కగతే అయింది. ఆవిడ పని మానుకుని ఒక పూటల్లా రంగడిదగ్గిరే కూచుంది. ఎందుకు కూచున్నదీ ఆవిడకే తెలిదు. వాడిమీద తనకిప్పుడేహక్కూ లేదని ఆవిడకింకా స్పష్టంగా తెలియలేదు. రంగడి భక్తులెవరూ తనను గురించి పట్టించుకోవటం లేదు. మధ్యాహ్నం పదకొండింటికి ఆవిడకు ఎవరో కోప్పడ్డట్టయింది. తాను ఇక్కడ కూచుంటే ఇంటిపను లెవరు చేస్తారు? అయినా తనకిక్కడ ఏంపని? తాను రంగడికి కానుకలివ్వటంగాని, మొక్కుకోవటంగాని

అసంభవం. అసలు రంగడు అట్లాకూచోవటమే ఆవిడకు ఎబ్బెట్టుగా ఉంది. ఎవరికీ చెప్పకుండా మాలక్ష్మమ్మ వెళ్ళిపోయింది.

రంగడికి ఫొటో తీయించి పత్రికల్లో వేయించాలని వెంకయ్య సంకల్పించాడు. వెంకయ్య దగ్గిర పాత కెమెరా ఒకటుంది. దాంతో ఫొటోలు తీశాడు. కాని లాభం లేకపోయింది. ఒక ఫొటోలో రంగడి తలకాయలేదు. రెండోదాన్లో వాడు ఒరగబడి కూచున్నట్లు పడ్డాడు. అన్నిటిలోనూ పొగమంచు రంగణ్ని ఆవరించినట్టుగానే వుంది. ఒక్కదానిలోనూ వాడి మొహమూ ముక్కూ తెలియరావటంలేదు.

గత్యంతరంలేక వెంకయ్య బస్తీకివెళ్లి ఒక ఫొటోగ్రాఫర్ని తీసుకొచ్చాడు. వాడు మూడు ఫొటోలు ఎత్తాడు. ఒకదాంట్లో రంగడు ఒకడే ఉన్నాడు. రెండోదాన్లో రంగడూ, పక్కన రాఘవయ్యా ఉన్నారు. ఇది చాలా అన్యాయం. "రంగడివెంట నువ్వుంటే నేనూ ఉండాలి". అని వెంకయ్య అభ్యంతరపెట్టినమీదట మూడో ఫొటో ముగ్గురితోనూతీశాడు ఫొటోగ్రాఫర్. రాఘవయ్యే డబ్బిచ్చిపంపాడు.

నాలుగోనాటికి ఫొటోలు వచ్చాయి. అన్నీ ఒకఫొటో కాపీలే. అందులో రంగడూ రాఘవయ్యామాత్రమేఉన్నారు. వెంకయ్య ఆదరాబాదరా బస్తీకిపోయి ఫొటోగ్రాఫర్ని ఇదేమిటని అడిగాడు. "నన్నేం చెయ్యమన్నారు? మిగిలిన రెండు ప్లేట్లూ పగిలిపోయాయి." అన్నాడు ఫొటోగ్రాఫర్.

రంగడు చాలా గిట్టుబాటుగా ఉన్నాడు. వాడూ, రాఘవయ్యా ఉన్న ఫొటో పత్రికల్లో పడ్డప్పటినుంచీ జనం దూరపుగ్రామాలనుంచి కూడా రాసాగారు. కట్నాలూ,

కానుకలూ, రాసాగాయి. ఇందులో వెంకయ్యకు వంతుపెట్టటం రాఘవయ్యకు ఖుష్కుదండగగా తోచింది. "నువ్వుకూడా పనిమానుకోని ఈ తోటలో దేనికి? పనిబడ్డప్పుడు నేను నీకు కబురుచేస్తాగా!" అన్నాడు రాఘవయ్య వెంకయ్యతో.

"ఓహో! అదా సంగతి!" అన్నాడు వెంకయ్య.

మర్నాటినుంచీ వెంకయ్య రకరకాల ప్రచారం చెయ్యసాగాడు. రంగడు మూడుపూటలా మెక్కి తింటాడనీ, రాఘవయ్య ప్రపంచాన్ని వంచిస్తున్నాడనీ ఊరూరా ప్రచారం చెయ్యసాగాడు. ఈ ప్రచారం ఊరికే పోలేదు. రంగడికి కానుకలు అర్పించుకున్నవాళ్ళు కొందరు ఏ మహాత్మ్యాలేదనీ వాడికి దణ్ణంపెట్టి కోరుకుంటే కోరిక సిద్ధించదనీ అనసాగారు.

ఒకరోజున వెంకయ్యగారి దడి అంటుకుంది. రంగణ్ణి గురించి దుష్ప్రచారం చేసినందుకే ఈ పని జరిగిఉంటుందని రాఘవయ్య కొందరితో అన్నాడు. అందరూ నమ్మలేదు, రంగణ్ణిగురించి ఎందరో ఎన్నిరకాలుగానో చెప్పుకున్నారు. కాని వాడి అవస్థ విచారించినవాడు లేడు. వాడిగతి నానాటికీ దుర్భరమవుతున్నది. రాత్రిపూటే వాడి ప్రాణానికి కాస్త సుఖం. ఒకరాత్రి వాడు కుటీరందాటి తోటదాటి పొలాలన్నీ చుట్టివచ్చాడు. ఇంటికి రాగానే రాఘవయ్య చావదన్నాడు.

"ఈసారి తోటదాటి పోయి చూడు, పూడ్చిపెడతా!" అన్నాడు రాఘవయ్య, ఆ మర్నాటి రాత్రి రాఘవయ్య గురకపెట్టి నిద్రపోతున్న సమయంలో రంగడు తోట దాటాడు. రాఘవయ్య తంతాడని కాబోలు మళ్ళీ వాడు ఆవూరికి తిరిగిరాలేదు. వాడిజాడ తెలుసుకున్నవారుకూడా లేరు.